

కాల్ బెల్ మోగింది తిక్క-తిక్కగా.

కంచంలో చెయ్యిపెట్టబోతూ ఆగి పోయేడు గోపాలం. చిరాగ్గా ముఖం ముడుచుకుంది సుశీల.

"ఎవరైనా పేషెంటేమో ! – "
అంటూ లేవబోయేడు గోపాలం.

"ఇంతసేపూ డిస్పెన్సరీలో సేవ చేసొచ్చేరు – చాలదూ ? కూచుని స్తిమితంగా భోంచెయ్యండి – నే వెళ్ళి చూస్తాను. పేషంటూ గీషెంటూ అయితే కాస్సేపు వెయిట్ చేస్తారు ... "
అంటూ వీధి గుమ్మం దగ్గరికి నడిచింది సుశీల.

డాక్టర్లలో ఆదర్శ డాక్టరు–గోపాలం. డ్యూటీ ఫస్ట్, డిన్నర్ నెక్స్ట్ - అనుకునే మనిషి. అందుచేత - కంచంలో చెయ్యి పెట్టకుండా అలాగే కూచున్నాడు.

వీధి తలుపు తీసిన శబ్దం వినిపించింది.

"మీరా ! ... " అంది సుశీల గొంతు.

"అవు న్నేనే - అదేంటమ్మా అలా చిక్కిపోయేవ్ ?"

ఉలిక్కిపడ్డాడు గోపాలం. అది శంకరం గొంతు !

తిక్క శంకరం గొంతు !

"ఏదమ్మా ! వీడేడీ ? – " అంటూ హాల్లో కొస్తున్నాడు శంకరం.

"ఉన్నారండీ ... ఇప్పుడే భోజనాని కూర్చున్నారు..."

"ఇప్పుడే కూచున్నాడా ? — అఁ ?"

"ఉండండి - చెప్తాను !"

"అఁ ! అఁ ! డిస్టర్బ్ చెయ్యొద్దు- నిదానంగా తినమను - నాకేం - నేను వెయిట్ చేస్తాలే ! ... "

డైనింగ్ రూంలో కొచ్చి - "మీ శంకరంగారు ! ... వెయిట్ చేస్తా మన్నారు లెండి - " అంది సుశీల.

పులుసు వడ్డించబోయింది.

సందిగ్ధంలో పడ్డాడు శంకరం.

లోపలేమో ఆకలేస్తోంది...

అయినా - వెయిట్ చేస్తానన్నాడు కదా శంకరం !...

ఎటూగానివేళ — ఎందుకొచ్చినట్టో? వెయిట్ చేస్తానన్నాడు - ఊసుపోక వచ్చాడు కాబోలు !

గోపాలానికి శంకరంతో ఐదా రేళ్ళుగా పరిచయం. అతి దగ్గర పరిచ యమే ! నిజానికి శంకరం చాలా కలుపుగోలు మనిషి. పరిచయమైన ప్రతివాడితోనూ పదినిమిషాల్లో ఇట్టే కలిసిపోతాడు. అతని దగ్గర అదో రకమైన అమాయకత్వం ఉంది. మంచి తనం ఉంది. గోపాలం ఉన్న వీధిలోనే మరో చివర ఉంది శంకరం వాళ్ళిల్లు. అయినా అతను గోపాలం వాళ్ళింటికి రావడం చాలా తక్కువే ! అసలు శంకరం తరహాయే అంత ! ఎక్కడో, ఏ బజార్లోనో ఏ షాపు దగ్గరో కనిపించి దబదబ మని ఏకధాటిగా ఓ ముప్పావు గంట లెక్చరిచ్చేస్తాడు. అంతలో – ఉన్నట్టుండి ఏదో గుర్తొచ్చి- "వొస్తా గురూ ! అర్జెంటు పనుంది - ఆనక కలుస్తా !" అని మాయమై పోతాడు. కొన్నిసార్లు అదేపనిగా సాయం త్రాలూ ఇఁటికొచ్చి కబుర్లు చెప్పి పోతాడు. ఒక్కోసారి నెలల తరబడి అతని అయిపే ఉండదు. ఏమయి పోయేడో పక్షి - అనుకుంటూండగా - ఏ రాత్రి తొమ్మిదీ యాభై తొమ్మిదికో వొచ్చి తలుపు తట్టి - "మహావీర్‌లో మంచి అరవ సినిమా ఉంది - సెకెండ్ షో కెళ్దాం రా గురూ ! - " అని అర్జెంటుగా ఆహ్వానిస్తాడు. ఇంకో అలవాటు కూడా ఉంది శంకరానికి. ఏమీ తోచనప్పుడు - అదే ఊళ్ళో ఉన్న మిత్రులకి ఉత్తరాలు రాస్తూంటాడు. ఒకే వీధిలో ఉన్న గోపాలానికి కూడా శంకరం నుంచి లోకల్ పోస్టులో ఉత్తరా లొచ్చేయి. దేశంలోని సాంఘిక, ఆర్థిక,

రాజకీయ పరిస్థితుల గురించిన శంకరం అభిప్రాయాలన్నీ ఎప్పటికప్పుడు పోస్టులో మిత్రబృందానికి అందుతూనే ఉంటాయి.

లోకంలో ఎలాంటివాళ్ళకీ సన్మానాలూ, బిరుదప్రదానాలూ జరుగుతూనే ఉంటాయి. శంకరంవంటి అశేష ప్రజ్ఞాశాలికీ, స్నేహశీలికీ, మేధావికీ గుర్తింపు లేకుండా పోతుందా ? గుర్తింపు ఉండకేం ?

మిత్రబృందమంతా కలిసి శంకరానికి "తిక్క" బిరుదును తలిగించేరు.

శంకరం....తిక్క శంకరం... టి. శంకరం !

ఇలస్ట్రేటెడ్ వీక్లీ తిరగేసిన తర్వాత ఫిల్మ్ ఫేర్‌లో బొమ్మలు చూడడం మొదలెట్టేడు శంకరం.

టవల్‌తో చెయ్యి తుడుచుకుంటూ వొచ్చేడు గోపాలం— "సారీ శంకరం ! బోరు కొట్టిందా !" అన్నాడు.

"అఁ — అఁహాఁ - నాకేఁవిటి - బోరేఁవిటి ? — హేమ్మామాలిని ఫుటో చూసేవా ? చాలా ఛార్మింగ్ గా వుందోయ్" అన్నాడు శంకరం ఫిల్మ్ ఫేర్‌లోంచి తలెత్తకుండానే.

గోడగడియారం వరసగా తొమ్మిది గంటలు కొట్టింది.

సిగరెట్టు ముట్టిస్తూ సోఫాలో కూచున్నాడు గోపాలం. అతనికి లోపల్లోపల సంతోషంగా వుంది. వేళగానివేళ వచ్చేడు శంకరం. అయితేనేం - ఎంచక్కా కబుర్లు చెప్పిపోతాడు.

"మీ ఆఫీసెలా వుందోయ్ ?" అన్నాడు గోపాలం.

ఫిల్మ్ ఫేర్ మధ్యపేజీని నిలువుగా తిప్పి చూస్తూ - "సిగరెట్టుందా ?" అన్నాడు శంకరం.

గోపాలం సిగరెట్టందించేడు.

"అగ్గిపెట్టుందా ?"

శంకరంయొక్క సిగరెట్టు వెలిగించి గోపాలం హాయిగా నవ్వేడు. "శభాష్ శంకరం !" అన్నాడు.

పరధ్యానంగానే సిగరెట్టు పొగ వొదుల్తూ - అప్పుడు తేరుకుని, ఫిల్మ్ ఫేర్ పక్కన పెడుతూ - "యాఁవన్నావ్ ?" అన్నాడు శంకరం.

"సినిమా యాక్టర్‌లాగే చెప్పేవు డైలాగు-" అన్నాడు గోపాలం.

కళ్ళు చికిలించి, గుప్పిటి బిగించి గంభీరంగా సిగరెట్టు దమ్ములాగి, నుసి రాలిపడేలా అలవోగ్గా చిటికేసి - చిద్విలాసంగా నవ్వుతూ - "ఫినిష్ ! - " అన్నాడు శంకరం.

"బావుంది - బావుంది ... ఇంకా ఏమేం సినిమాలు చూసేవు శంకరం?"

"ఏమో !"

"అదేఁవిటి ?"

"అవును. వారానికి రెండు చూసేను. అయితేనేం — వొక్కటీ గుర్తుండి చావడంలేదు. మరికొన్ని సినిమాల్లో -

ఇంటర్వెల్ తర్వాత కాస్సేపటికి – ఫస్టాపులో వున్న యాక్టర్సెవరో కూడా జ్ఞాపకం రావడంలేదు ! – మన బుర్ర దెబ్బతినిందనుకునేవు ... అదేమీ లేదు. ఎప్పట్లాగే అది ఆల్ రైట్...ఈ మధ్య నొస్తున్న సినీమాలలా వున్నాయి ... అస్సరే – నేనో మాటడగనా ? ... "

"అడుగు."

"ఏఁవీ అనుకోగూడదు సుమా!"

"అదేఁవిటి శంకరం ! ... ఇవాళేఁ విటిది కొత్తగా ..."

"అంతగా కొత్తగా వుంటుంది నాయనా ... గోపాలకృష్ణా ! ... నీ డిస్పెన్సరీలో ఆడ నర్సు చేరిందటగా కొత్తగా..."

"అయితే ?"

"ఆవిడో గొప్ప బ్యూటీ అటగా ! ...అదుగో ... అదుగో ... కల్ప్రిట్ దొరికిపోయేడు ... ఈ సంగతి మీ ఆవిడకి చెప్పేవాళ్ళెవరూ లేరనుకున్నావు కాబోలు...ఆగాగు – నే చెప్పేస్తాను... ఇదుగో చెల్లాయ్ ! ..."

నిజంగానే గాభరాపడిపోయేడు గోపాలం. తిక్కశంకరం ఇందుకేనేమిటి ఎటూగానివేళ పనిగట్టుకుని వస్త ? సుశీల అసలే – లేడీ ఆఫ్ మూడ్స్ ! ఈ వెధవ చొల్లుకబుర్లన్నీ వాగడం మొదలెడితే – సుశీల దాన్ని సీరియస్‌గా తీసుకుంటే–గుడ్ గాడ్ !

"తగ్గు నాయనా శంకరం ... కాస్త తగ్గు ... " అని బ్రతిమిలాడుకున్నాడు గోపాలం. "నీ తిక్కతో నాకు తిక్క పుట్టించకు ... నీకు పుణ్యముంటుంది బాబూ !"

చిద్విలాసపు నవ్వును పెదవులమీద తళుక్కుమనిపించేడు శంకరం. "నీ సిగరెట్టు బ్రాండేఁవిటోయ్ ? విల్స్ కింగ్సా ? లేకపోతే ఏకంగా గోల్డ్‌ఫ్లేకా? ... మా మజాగా వుందోయ్ ! ... " అంటూ ప్యాకెట్టు అందుకుని ఇంకో సిగరెట్టు వెలిగించేడు.

గ డి యా ర ం ఠ ం గు మ ం ది. తొమ్మిదిన్నర.

'ఇహ వీడు కదిల్తే – నన్ను వదిల్తే – బావుణ్ణు –' అనుకున్నాడు గోపాలం. "ఇ ం కేఁ వి టో య్ సంగతులు – శంకరం? " అన్నాడు. 'ఇంకేఁ వుంటాయిగాని – దయచెయ్యి' అంటున్నట్టు.

పట్టించుకోలేదు శంకరం. అమిత సీరియస్సుగా కొంతసేపు సిగరెట్టు పీల్చేడు. ఆ తర్వాత – "సంగతులా ? ...ఇంకేఁవిటంటావా ? – వూఁ ... " అంటూ మొదలెట్టేడు. "గోపాలం... ఇవి చాలా చెడ్డరోజులోయ్ ... చెడ్డకి అడ్డులేదు. మంచికి గుర్తింపూ లేదు. ప్రోత్సాహమూ లేదు. మొన్నటికి మొన్న మా ఆఫీసులో ఏం జరిగిందో తెలుసా ?...హయ్యో రామ ... నీకెలా తెలుస్తుంది ? నువ్వా నీ డిస్పెన్సరీ

తప్ప మరో ప్రపంచమే తెలీదు నీకు... మా ఆఫీసులో యూడీసీ పోస్టొహటి ఖాళీ అయిందోయ్ ... అదే - ఆ శవం గాడు, శోభనాద్రి రిటైరయ్యాడుగా మరి ... సరే ... ఆ తర్వాతేం జరిగిం దనుకున్నావ్ ?..." తన ఆఫీసులో జరిగిన తెరచాటు లాలూచీలతో మొద లెట్టి రాష్ట్రరాజకీయాలకి వెళ్ళిపోయేడు శంకరం. అటుతర్వాత ఎమ్మెల్యేలు, ఎం.పీ.లు, మంత్రులు, పార్లమెంటు, విదేశీరాయబారాలు, బాంగ్లా పరిస్థితి.

తలనొప్పి ప్రారంభమైంది గోపాలానికి.

ఠంగ్ ఠంగ్ మంటూ పదిగంటలు కొట్టింది గడియారం.

చిటికేసి ఆవులించి నిద్రరాకని తెలియజేసేడు గోపాలం. కాని, శంకరం దాన్నికూడా పట్టించుకోలేదు.

"అసలు అమెరికన్సంతే గురూ!... ఏది చేసినా వాళ్ళే చెయ్యాలి! ... 'టైం'లో నువ్వా ఫొటోలు చూళ్లేదు కాబోలు ... సింప్లీ మార్వెలస్ ... ఇవతల ప్రెసిడెంట్ ఫోర్డు ... అవతల అమ్మాయి చేతిలో పిస్టల్ ! ... సింప్లీ వండ్రఫుల్ ! అసలా సమయంలో ఆ జనంలోకి కెమెరా ఎలా వెళ్ళిందీ అని ? ..." అని ఫోర్డుమీద హత్యా ప్రయత్నం గురించి కాక ఆ సంద ర్భంగా వొచ్చిన ఫొటోల గురించి తెగ ఆశ్చర్యపోతున్నాడు శంకరం.

గోపాలంలో చిరాకు నసాళానికి అంటుతోంది. 'ఓ దేవుడా ! నువ్వు న్నావో లేదో నాకు తెలీదు. నీతో పని బడుతుందని కూడా నే నెప్పుడూ అను కోలేదు. డాక్టరుగా నేను ప్రాణాలయితే శాయశక్తులా నిలబెట్టగలను. కాని, వేళగాని వేళొచ్చి ఇలా నా ప్రాణాలు తింటూన్న యీ తిక్క-శంకరంగాణ్ణి వొదిలించుకోవడం ఎలాగో తెలీడం లేదు. ఈ వొక్కసారికీ కాస్త కల్పించు కుని నన్నీ ఆపదనుంచి కాపాడు. నీకంతగా తీరికలేకుంటే నన్ను కాపాడే వాణ్ణెవణ్ణయినా పంపించు -' అని 'ముత్యాల ముగ్గు'లో రావుగోపాలరావు లాగా కాస్సేపు ప్రార్థించేడు. అయినా లాభంలేకపోయింది. దేవుడికి తీరిక లేకపోయుండొచ్చు. లేకపోతే- ఆయనకీ ఏ తిక్క-శంకరంగాడో తగిలుండొచ్చు.

కణతలు నొక్కుకున్నాడు గోపాలం. ఉలిక్కిపడ్డాడు. "అయ్యో ! —సుశీలకి వొంటరిగా ఇంకెంత బోర్ కొడుతుంటుందో ! ... తిట్టుకుంటూంది కాబోలు..." అనుకున్నాడు.

"ఫెమినా" - "ఈవ్స్ వీక్లీ" కూడా తిరగేసి అవతలికి గిరాటెట్టింది సుశీల. మంచమ్మీద అటూ ఇటూ పొర్లింది. బెడ్‌లాంప్ కూడా ఆఫ్ చేసింది. గోపాలంమీద చెప్పలేనంత కోపమొచ్చింది. ఇంట్లో ఇద్దరూ ఉండి కూడా విరహం అనుభవించాల్సిన

ఖర్మేం పట్టిందె ? విరహం కారణం శంకరం. శంకరంమీద కూడా చెప్ప లేనంత కోపమొచ్చింది సుశీలకి.

శంకరం, సిల్లీ శంకరం, తిక్క శంకరం– అని కసికసిగా తిట్టుకుంది.

తలగడని గోపాలంగా అమర్చుకుని కావలించుకు నిద్రపోదామని ప్రయత్నిం చింది. ఊఁహుఁ ... వీలుకాలేదు. మళ్ళీ బెడ్‌లాంప్ వేసి ఇంకో పుస్తకం ఏదో చేతుల్లోకి తీసుకుంది. కొంతసేపు తల్లక్రిందులుగా చదవడం ప్రాక్టీసు చేసింది.

ముందు గదిలోంచి శంకరం గొంతు గంటకొట్టినట్టు వినిపిస్తోంది –

"అసలీ విమెన్స్ లిబ్బూ గిబ్బూ అంతా హంబగ్గోయ్ ! ఈ ఆడవాళ్ళకి మనం ఏం తక్కువ చేసేమని ?... మన భారత సంస్కృతి స్త్రీని ఎప్పు డైనా తక్కువగా చూసిందా ?... సంపాదన మగాడిదే – కావచ్చు – కాని ... ఇంటిపెత్తనమంతా ఎవరిది ? ఆడ దాన్దే గదా ?...మరింక వాళ్ళకి సమాన హక్కులు లేకపోవడం ఏఁవిటి ? ... ... గాడిదగుడ్డు ... అసలూ ... ఈ అంతర్జాతీయ మహిళాసంవ త్సరం ఇదీ అంతా..."

" అవునవును – " అన్నాడు గోపాలం, సగం కళ్ళు మూసుకుని.

"నన్నడిగితే – వొచ్చే యేడాది అంతర్జాతీయ మొగ సంవత్సరం – ఏం – పేరు బావుండదా – సరే – అంత ర్జాతీయ పురుష సంవత్సరం – డిక్లేర్ చెసెయ్యాలోయ్ ... యాఁవంటావ్... ఈ ఐడియా ఇంతవరకూ ఎవరికీ వొచ్చినట్టు లేదు ... 'పంచ్' లో వో కార్టూన్ చూసేసరికి నాకే స్ట్రయి కయింది. హహ్హాహ్హా...భలే కార్టూన్లే... హహ్హా...నువ్వు చూళ్లేదా...వండర్... వొక ఆడపిల్లుంటుందన్నమాట... పిల్లి కాదూ...పిల్ల..."

"నీకు నిద్రొస్తోన్నట్టుంది శంకరం–" అన్నాడు గోపాలం– వొళ్ళువిరుచుకుంటూ ఆవులిస్తూ.

ఇంకో సిగరెట్టు వెలిగించి పొగ వూదుతూ ... ''యూనివర్సిటీలో ఆర్టెగ్జి బిషన్ నువ్వింకా చూణ్ణేలేదన్నమాట!–" అన్నాడు శంకరం.

'దేవుడు లేడు !–' అనే నిర్ణయాని కొచ్చేసి చాలాసేపైంది గోపాలం. 'ఉన్నాడని ఎవడైనా అనే వాడుంటే వాణ్ణి ఈ శంకరంగాడి దగ్గ రోపూట కూచోబెడతాను – ' అని (తనలో) పళ్ళు నూరుకున్నాడు గోపాలం.

ఠంగుమంది గడియారం. పదిన్నర.

సోఫాలోనే బాసింపట్టేసుక్కూచుని, మధ్య మధ్య మోకాలిమీద చేత్తో చరుస్తూ, ధూమపానం సాగిస్తూ–కబుర్లు చెబుతున్నాడు శంకరం.

'శంకరా ! – ' అని దిగాలుపడి కూచున్నాడు గోపాలం. ''నన్ను



మన్నించు సుశీ ! - నన్ను మన్నించు ! ...సత్యభామ కృష్ణుణ్ణి సత్కరించిన ట్టివాళ నన్ను సత్కరిస్తావేమో ! ... అయినా సరే ! - నన్ను మన్నించు-" అని మనసులో జపించుకుంటూ మనసు టెలిగ్రాంద్వారా బెడ్‌రూంలోని భార్యకి (అతనికి రూం రూం కొక్కో-భార్యలేదు- వొక్క-భార్యే - ప్రస్తుతం బెడ్రూంలో వుంది !) సందేశం పంపాలని ప్రయత్నిస్తున్నాడు.

బెడ్‌రూంలోని సుశీలకి భర్త వర్తమానం అందింది ! 'పాపం ! - శంకరాన్ని వొదిలించుకోలేక ఆయన ఎంత బాధపడుతున్నారో - ఎంత సేపని వుల్లాసంగా వుంటున్నట్టు నటిస్తున్నారో !...' అనుకుంది.

టైంపీస్‌వేపు చూసి వులిక్కి-పడింది ... పదీ యాభై అయిదు. శంకరం వొచ్చింది ఎనిమిదీ యాభై కి- అంటే - రెండుగంటలైందన్నమాట !

శంకరం, తిక్క-శంకరం !

తన సంగతి సరే ! భర్త హాల్లో, తను బెడ్రూంలో, ఈ విరహం భరించడం అట్టే కష్టమేం కాదు.

కాని, పాపం - పార్వతి ? (శంకరం భార్య పేరు పార్వతి.)

సుశీల మనసులో తళుక్కున మెరుపు మెరిసింది. తనిప్పుడు హాల్లోకి యధాలాపంగా వెళ్ళి శంకరానికి భార్యను గుర్తు చేస్తే ? - అప్పుడైనా నిష్కృతి మించదూ ?...

"గుడ్ ఐడియా !..." అనుకుంది సుశీల.

లోపల్నుంచి వస్తూన్న సుశీలను చూసి ముఖం చాటంత చేసుకున్నాడు శంకరం – "రామ్మా ! - రా ! ... లేటుగా అడుగుతున్నా - ఏఁవీఁ అనుకోకు – నువ్వు కులాసే కదూ ?"

"కులాసేనండీ అన్నగారూ !" అని కొంచెం నవ్వింది. ఆ తర్వాత వొక్కొక్క అక్షరం విడదీస్తూ - "మా–పార్వతి–ఎలా–వుంది ?" అంది.

శంకరం నవ్వేడు – "ఆఁ - పిచ్చి మొద్దు - దానికేం ... నిక్షేపంలా వుంది - చక్కగా వొండుకు తినడం ...దానికేం ... " అంటూ టక్కున ఆగిపోయేడు.

అంతే !

ఒక్కక్షణంలో అతని కళ్ళలో పెద్దమెరుపు మెరిసింది.

అతని ముఖం తెల్లగా పాలిపోయింది.

"కెవ్ కెవ్న కేకవేసేడు శంకరం. (ఆ కేక అటు నాలుగిళ్ళకూ ఇటు అయిదిళ్ళకూ వినబడిందని ఆ తర్వాత తెలిసింది,) "అయ్యో ! గోపాలం !... కొంప మునిగింది !"

"ఏఁవిటి ? ... ఏఁవయింది?..." అన్నాడు గోపాలం గాభరాగా. దిమ్మెరపోయి నిలుచుంది సుశీల.

మనిషి మనిషే వణికిపోతున్నాడు శంకరం.

"ఎనిమిదిన్నరకి హఠాత్తుగా ఏదో ఫిట్ లాగా వచ్చి పార్వతి స్పృహతప్పి పడిపోయింది !... నిన్ను తీసుకెళ్ళాలని వొచ్చి ఆ సంగతే మరిచిపోయేను... ఘోరం ! ఘోరం ! ...గోపాలం ! - నీ బ్యాగ్ తీసుకుని వెంటనే బయల్దేరు !..." సుడిగాలిలా బయటికి పరుగెత్తేడు శంకరం.

సుశీలకి వొళ్ళంతా చల్లబడిపోయింది. గోపాలం షాక్‌నుంచి తేరుకుని కదలడానికి కొంతసేపు పట్టింది.

తిక్కతిక్కగా పదకొండుగంటలు కొడుతోంది గడియారం.